
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.7, కనిష్ఠం 18.3

నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 6 జనవరి 2024



ప్రాక్టికల్స్ నిర్వహణకు నిధుల కొరత

- జూనియర్ కళాశాలలకు భారంగా ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణ
- నాలుగేళ్లుగా విడుదల కాని నిధులు
- ఫిబ్రవరిలో విద్యార్థులకు ప్రాక్టికల్స్

నిజామాబాద్ అర్బన్, జనవరి 5: ఇంటర్మీడియెట్ పరీక్షల షెడ్యూల్ విడుదల కాగా ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డ్ నిర్ణయించింది. మరో 25రోజుల్లో ఇంటర్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి చివరి మాసంలో వార్షిక పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలలు నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రయోగ పరీక్షలంటే వాటికి సంబంధించిన పరికరాలు, కెమికల్స్, ఇతరత్రా వస్తువులు అవసరం ఉంటాయి. ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు కీలకం. కానీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా ప్రాక్టికల్స్‌కు సంబంధించిన నిధులను విడుదల చేయకపోవడంతో ప్రాక్టికల్స్ తూతూ మంత్రంగానే నిర్వహిస్తున్నారు. ప్రాక్టికల్స్‌కు సంబంధించి విద్యార్థులకు అధ్యాపకులు ముందుగానే సాధన చేయించాల్సి ఉండగా నేరుగా పరీక్షలప్పుడే విద్యార్థుల చేత ప్రాక్టికల్స్‌ను చేయిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో 20వేల 410 మంది విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇందులో 15 ప్రభుత్వ కళాశాలలు, 9 టీఎస్ సోషల్ వెల్ఫేర్ కళాశాలలు, 3 టీఎస్ ఆర్‌జేసీ కళాశాలలు, 3 ట్రైబల్ వెల్ఫేర్, 6 బీసీ వెల్ఫేర్, 17 టీఎంఆర్‌జేసీ, 10 మోడల్ స్కూల్స్, 9 కేజీబీవీలు ఉండగా, 42 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి.

భారంగా మారిన నిర్వహణ

ఇంటర్మీడియట్ విద్యార్థులకు కీలకమైన ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు భారంగా మారింది. ప్రాక్టికల్స్ నిర్వహణకు సంబంధించి ప్రతి సంవత్సరం కళాశాలలకు రావాల్సిన నిధులు విడుదలకాకపోవడంతో పరీక్షల నిర్వహణ అంతంతమాత్రంగానే సాగుతోంది. ఇంటర్‌లో సైన్స్ విద్యార్థులకు థియరీతో పాటు ప్రాక్టికల్స్ చాలా ముఖ్యం. చదువుకున్న పాఠాన్ని ప్రాక్టికల్స్‌లో చేయాల్సి ఉంటుంది. ప్రైవేటు కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత నాలుగేళ్లుగా ప్రాక్టికల్స్ నిర్వహణకు సంబంధించిన నిధులు విడుదలకాకపోవడంతో కళాశాలల్లో ఉన్న ల్యాబ్‌లలో అరకొర వసతులు, శిథిలావస్థలో ఉన్న ల్యాబ్‌లు, తుప్పుపట్టిన పరికరాలతోనే విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ యేడాది ప్రాక్టికల్స్‌కు సంబంధించి ఇప్పటికి ఎలాంటి పరికరాలుకాని, రసాయనాలు కాని కొనుగోలు చేయలేదు. పాత పరికరాలు, పాత రసాయనాలతోనే ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఇంటర్ విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రైవేటు విద్యార్థులతో పోలిస్తే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో తక్కువ మార్కులను సాధిస్తున్నారు. ఈ ప్రభావం విద్యార్థుల యొక్క ఎంసెట్ ర్యాంకులపై పడుతుంది.

పురాతన భవనాలు, అరకొర వసతులు

ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించి నిర్వహణ భారంగా ఉంది. కళాశాలలను నిర్వహించేందుకు సిబ్బందిలేక, నిధులులేక సమస్యల నిలయంగా కళాశాలలు ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంత కళాశాలల్లో సమస్యలు అధికంగా ఉంటున్నాయి. జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 8వేల వరకు విద్యార్థులు అడ్మిషన్‌లు పొందినట్లు తెలుస్తోంది. సుమారు 7వేల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి విద్యార్థికి రూ.25 చొప్పున కళాశాలల నిర్వహణకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం అందజేస్తుంది. కానీ గత ఆరు నెలలుగా కళాశాల నిర్వహణకు సంబంధించిన బిల్లుల రాకపోవడంతో కళాశాలల్లో సానిటైజర్‌లు, రిజిస్టర్‌లు, చాక్‌పీస్‌లు, ఇతరత్రా వస్తువులు కొనేందుకు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది.

పాత పరికరాలు, రసాయనాల కొరత...

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సంబంధించి ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మార్కులు సాధించే పరిస్థితి లేదు. శిథిలావస్థలో ఉన్న ల్యాబ్‌లలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రాక్టికల్స్ నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా పాత పరికరాలు, పాత రసాయనాలతోనే విద్యార్థులు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. ప్రయోగశాలలు సైతం ఎలాంటి వసతులు లేకుండా పాత భవనాల్లో కొనసాగుతున్నాయి. సూక్ష్మదర్శినితో పాటు కణజాలాలు, స్లైడ్స్‌కు సంబంధించిన పరికరాలను 2013-14లో సరఫరా చేశారు. ఇప్పటికీ పాత పరికరాలతోనే ప్రాక్టికల్స్‌ను నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా జూనియర్ కళాశాల ప్రయోగశాల పురాతన భవనంలో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. ప్రతి వారం సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉండగా కేవలం తూతూమంత్రంగా ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఒకటి రెండు రోజుల ముందు ప్రాక్టికల్స్‌పై విద్యార్థులకు క్లాసులు నిర్వహించి మొక్కుబడిగా తరగతులు నిర్వహిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో అధిక మార్కులు వస్తూ ప్రభుత్వ విద్యార్థులకు మాత్రం అంతంతమాత్రంగానే మార్కులు వస్తున్నాయి. గత రెండు మూడేళ్లుగా కళాశాలలకు ప్రాక్టికల్ సంబంధించిన పరికరాలుగాని, రసాయనాలుగాని సరఫరా చేయలేదు. స్థానికంగా రసాయనాలు కొనుగోలు చేసి ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. మూడేళ్ల క్రితం ప్రాక్టికల్స్ సంబంధించిన నిధులు విడుదలకాగా గత రెండేళ్లు కరోనాతో ప్రాక్టికల్స్ నిర్వహించలేదు. గత యేడాది నిర్వహించిన బిల్లులు ఇంకా విడుదల కాలేదు. నిధులలేమితో ప్రభుత్వ కళాశాలల్లో అంతంతమాత్రంగానే ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి.

నిధులు రావాల్సి ఉంది..

: రఘురాజ్ (డీఐఈవో)

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు సంబంధించి గత సంవత్సరం నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన నిధులు ఇంకా విడుదలకాలేదు. పరికరాలు, రసాయనాల కొనుగోలుకు సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.



• పురాతన భవనంలో ఉన్న ల్యాబ్

• ఖిల్లా జూనియర్ కళాశాలలో పాత పరికరాలు

భీమ్‌గల్ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో



భీమ్‌గల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో రఘురాజ్

భీమ్‌గల్ రూరల్: పట్టణంలోని జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘురాజ్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. వివిధ సబ్జెక్టుల వారీగా అనేక ప్రశ్నలు అడిగారు. ఫిబ్రవరి28 నుంచి ప్రారంభమయ్యే పరీక్షల కోసం ఎలా చదువుకోవాలో, ఎన్ని గంటలు చదివితే పరీక్షల్లో విజయం సాధిస్తారో అర్థం చేయించారు. ఇష్టంతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ అబ్బ చిరంజీవి, అధ్యాపకులు కృష్ణదాస్ తదితరులు ఉన్నారు.

ప్రజా పాలనకు నేడే చివరి రోజు

- 4లక్షల 30వేలకు చేరిన దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం అర్హులైన ప్రజల నుంచి ప్రజాపాలన పేరుతో దరఖాస్తులను స్వీకరిస్తున్న కార్యక్రమం శనివారంతో ముగియనుంది. డిసెంబర్ 28 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ నేటితో ముగియనుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 4లక్షల 30వేల 192 దరఖాస్తులు రాగా, శనివారం మరిన్ని దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గామీణ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి మొత్తం 24 వేల 502 దరఖాస్తులు రాగా, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి 3వేల 497 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 27వేల 999 దరఖాస్తులు వచ్చాయి.



ప్రజా పాలనను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ



ఎన్నెల్‌దేవి లావణ్య

ఖాందేశ్ సంగీత

- ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఎవరిని వరించేనో?
- కొనసాగుతున్న ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు
- చైర్‌పర్సన్ ఎన్నిక సజావుగా జరిగేలా బీఆర్ఎస్ నేతల కసరత్తు

ఆర్మూర్‌రూరల్, జనవరి 5: ఆర్మూర్ నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఎవరిని వరించనుందోనన్న చర్చ జోరుగా సాగుతోంది. ఇదీ వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగిన పండిత్ వినీతపై అవిశ్వాసం నెగ్గడంతో మరోసారి చైర్‌పర్సన్ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నాలుగేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 23, బీజేపీకి ఆరు, ఇండిపెండెంట్‌లు ఐదుగురు, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల నుంచి ఒక్కొక్కరు గెలుపొందారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే బీజేపీ నుంచి ఒక కౌన్సిలర్, కాంగ్రెస్ నుంచి ఒక కౌన్సిలర్, ఐదుగురు ఇండిపెండెంట కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ బీఆర్ఎస్ పార్టీకి దక్కడానికి మార్గం సుగమమైంది. నాలుగేళ్ల పాటు కొనసాగిన చైర్‌పర్సన్‌పై సొంత పార్టీ కౌన్సిలర్‌లే అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో బీజేపీ కౌన్సిలర్‌ల సహకారంతో అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నూతన చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నారు. చైర్‌పర్సన్ ఎన్నికకు అధికారులు తేదీని ప్రకటించాల్సి ఉంది.

బలబలాలు ఇలా..

బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు ఇరువైపులా ఉండడంతో ఆశావహుల శిబిరంలో 19మంది కౌన్సిలర్లు ఉండగా మాజీ చైర్‌పర్సన్ మద్దతుదారులు 10మంది ఉన్నారు. బీజేపీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు, ఎంఐఎంకు చెందిన ఒకరు, కాంగ్రెస్‌కు చెందిన ఒకరు ఉన్నారు. మున్సిపల్‌లో మొత్తం 36వార్డులు ఉండగా 36మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యునిగా నమోదు చేసుకోవడంతో సంఖ్య 37కు చేరింది.

చైర్‌పర్సన్ ఎన్నికకు మార్గం సుగమమేనా ?

నూతన చైర్‌పర్సన్ ఎన్నికకు 19మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం ఉండగా ఆశావహుల శిబిరంలో బీఆర్ఎస్ పార్టీకి 20మంది కౌన్సిలర్ల మద్దతు ఉన్నట్లు తెలిసింది. వీరిలో 19మంది బీఆర్ఎస్ కౌన్సిలర్ల కాగా, ఎంఐఎం పార్టీకి చెందిన కౌన్సిలర్ మద్దతు కూడా బీఆర్ఎస్ పార్టీకి ఉన్నట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీ తరఫున చైర్‌పర్సన్ పదవి కోసం పోటీలో ఇద్దరు ఉన్నారు. వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, ఖాందేశ్ సంగీత శ్రీనివాస్‌లు చైర్‌పర్సన్ రేసులో ఉన్నారు. వీరిద్దరిని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఏకతాటిపైకి తెచ్చి చైర్‌పర్సన్ ఎన్నిక సజావుగా జరిగేలా చూస్తున్నారనే సమాచారం. దీంతో చైర్ పర్సన్ ఎన్నిక బీఆర్ఎస్ పార్టీకి మార్గం సుగమం కానుందని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే ఇంటికి వారేది!



నగరంలో ట్రాఫిక్ ఇలా..

- అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇక్కట్లు
- నగరంలోని గోదాం రోడ్డుపై అడ్డగోలుగా ట్రాఫిక్
- పట్టించుకోని అధికారులు

ఖిల్లా, జనవరి 5: నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఇంటికి వెళ్లాలంటే దారి కనిపించని పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ రోడ్డుపై ద్విచక్రవాహనాలతో పాటు, కార్లు, ఆటోలు, కూరగాయల తోపుడు బండ్లు రోడ్డుకు ఇరువైపులా నిండి ఉంటాయి. దీంతో ఈ దారిన సామాన్యుడు వెళ్లాలంటేనే నానా ఇబ్బంది పడుతుంటారు. అయినా ట్రాఫిక్, నగరపాలక సంస్థ సిబ్బంది పట్టించుకున్న పాపాన పోలేదు. నగరంలోని ప్రధాన రోడ్లపై వాణిజ్యసముదాయాలపై వాహనదారులు విచ్చలవిడిగా వాహనాలను నిలపడం వల్ల ప్రజలు తీవ్ర ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్‌స్టాండ్ ఇరువైపులా వాణిజ్య సముదాయాల ఎదుట రోడ్డుకు అస్తవ్యస్తంగా వాహనాలు నిలిచి ఉండడం వల్ల ప్రజలు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నగరంలోని గోదాం రోడ్డులో ఉదయం 6గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రోడ్డుకు ఇరువైపులా కూరగాయల వ్యాపారులతో పాటు వాణిజ్య సముదాయాల నిర్వాహకుల వాహనాలతో ఎల్లప్పుడు రద్దీగా ఉంటుంది. గత కొన్ని ఏళ్లుగా వస్తున్న ఈ తంతును సంబంధిత ట్రాఫిక్, నగర పాలక సంస్థ సిబ్బంది పట్టించుకోక పోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. గతంలో ఒకరిద్దరు చిరు కూరగాయల వ్యాపారులు కూరగాయలను అమ్ముకునే వారు కాని ప్రస్తుతం ఆ పరిస్థితికి భిన్నంగా తయారైంది గోదాం రోడ్డు పరిస్థితి.

పార్కింగ్ స్థలాల కొరత...

నగరం మున్సిపాల్టీ నుంచి నగర పాలక సంస్థగా ఎదిగినా నగరంలో పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో ప్రజలు విచ్చల విడిగా వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డుపై పార్క్ చేసిన వాహనాన్ని ట్రాఫిక్ సిబ్బంది ఫొటోలు తీసినా పట్టించుకోవడం లేదు. గతంలో నగరంలో కొన్ని చోట్ల వన్‌వేలను ఏర్పాటు చేశారు. వన్‌వేలపై అనుమానాలు, వివాదాలు అడ్డు రావడంతో వాటిని రద్దు చేశారు.

నిరుపయోగంగా రైతుబజార్లు

కూరగాయల అమ్మకాల కోసం నగరంలో మూడు చోట్ల రైతు బజార్లను ఏర్పాటు చేశారు. వి ఇప్ప టికీ కొనసాగుతున్నప్పటికి అందులో కేవలం ఇద్దరు, ము గ్గురు వ్యాపారులు మాత్రమే అ మ్మకాలు సాగిస్తున్నారు. మిగతా వారం దరు రోడ్ల పైనే అమ్మకాలు సాగిస్తున్నారు. నగరం నడిబొడ్డున గల పాత గంజ్ (గాంధీగంజ్) చుట్టూ కూరగాయల వ్యాపారులు అమ్మ కాలు సాగిస్తుండడం వల్ల సాయంత్రం ఆ దిశగా వాహనదారులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నగర పాలక సంస్థ సహకరించడం లేదు..

: నారాయణ, ట్రాఫిక్ ఏసీపీ

నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి నగరపాలక సంస్థ సిబ్బంది సహకారం ఇవ్వడం లేదు. ఈ విషయం గతంలో కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. అయినా వారు మాతో సహకరించడంలేదు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ సిబ్బంది సహరిస్తే నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం.

అడ్డగోలుగా అక్రమ వెంచర్లు!



• అక్రమ లే అవుట్‌లో చేపడుతున్న నిర్మాణాలు

ఎడపల్లి, డిసెంబర్ 30: మండలంలో అక్రమ లే అవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కుతూ కొందరు వ్యాపారులు వ్యవసాయ భూములను వెంచర్లుగా మారుస్తున్నారు. స్థానిక గ్రామపం చాయ తీనుంచే లే అవుట్ అనుమతులను తీసుకుని ప్లాట్లను చేసి విక్రయించాలన్న నిబంధన ఉన్నప్పటికీ దానిని వ్యాపారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులే అక్రమ వెంచర్ దారులకు వత్తాసు పలకడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. స్థానికులు అక్రమ వెంచర్లపై ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేసున్నారు.

ప్రభుత్వ అదాయానికి గండి

గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న అక్రమ లే అవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి స్వయంగా అధికారులే గండి కొడుతున్నారు. ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో అక్రమ లే అవుట్లలో నిర్మాణాలు ప్రారంభం అయినా సదరు పంచాయతీ కార్యదర్శి చర్యలు చేపట్టక పోవడం ఇందుకు నిదర్శనం.

ఇవీ నిబంధనలు..

వ్యవసాయ భూములను వెంచర్లుగా ఏర్పాటు చేయాలంటే ముందుగా రెవెన్యూ డివిజనల్ అధికారి నుంచి వ్యవసాయ భూమిని నాలాగా మార్పిడి చేసి ఆ తర్వాత లే అవుట్ కోసం గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాలి. ఇందుకు గాను లేఅవుట్ చేస్తున్న మొత్తం భూమిలో 10 శాతం భూమిని అభివృద్ధి కోసం గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ ద్వారా అప్పగించాలి. 33 ఫీట్ల వెడల్పుతో అంతర్గత రోడ్లను ఏర్పాటు చేయాలి. 15 శాతం భూమిని గ్రామ పంచాయతీకి మార్ట్‌గేజ్ చేయాలి. ఇవన్నీ సక్రమంగా ఉన్నపుడు పంచాయతీ కార్యదర్శి లే అవుట్‌కు అనుమతి ఇచ్చిన తర్వాత ప్లాట్ల విక్రయాలు జరపాలి.

చర్యలు తీసుకుంటాం..

: సుభాష్ చంద్రబోస్, ఎంపీవో

ఏఆర్పీ క్యాంప్ గ్రామంలో లే అవుట్‌లో జరుగుతున్న నిర్మాణాలపై మాకు తెలియదు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరుతాం. తదుపరి నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. అక్రమలే అవుట్లలో నిర్మాణాలు చేపడితే శాఖాపరమైన చర్యలు తప్పవు.

'విశ్వహిందూ పరిషత్ నుంచి ధన్‌పాల్ ఎమ్మెల్యేగా ఎదగడం సంతోషం'



మాట్లాడుతున్న యాదిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, జనవరి 5: విశ్వహిందూ పరిషత్‌లో కార్యకర్త స్థాయి నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ ఎమ్మెల్యేగా ఎదగడం సంతోషకరమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంఘటన మంత్రి ముడుపు యాదిరెడ్డి అన్నారు. శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ నివాసంలో ధన్‌పాల్‌కు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య ఉద్యమంలో ధన్‌పాల్ వీహెచ్‌పీ కార్యకర్తలను ముందుకు నడిపించారని ఆయన ఎమ్మెల్యేగా ఎదగడం సంతోషకరమన్నారు. ధన్‌పాల్ మాట్లాడుతూ వీహెచ్‌పీలో తన జీవితం ప్రారంభమైందని ఎంతో మంది త్యాగాల వల్ల నేడు అయోధ్య రామమందిరం పూర్తవుతుందని దానికి రాష్ట్ర కోకన్వీనర్‌గా తనను నియమించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణ, దినేష్, దాత్రిక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మలేషియాలో ఉపాధి కల్పిస్తామని చెప్పి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవీపేట,జనవరి5: తనకు మలేషియాలో ఉపాధి కల్పిస్తామని చెప్పి తన వద్ద రూ.95వేలు తీసుకుని మోసం చేసిన ఆర్మూర్‌కు చెందిన లక్ష్మణ్, అతని మేనల్లుడు దేవరాజ్‌లపై చర్యలు తీసుకోవాలని మండలంలోనిలోని బినోలకు చెందిన బాగుల నరేష్ శుక్రవారం నవీపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మలేషియాలో ఉపాధి కల్పిస్తామని ఆర్మూర్‌కు చెందిన లక్ష్మణ్, మలేషియాలో ఉంటున్న అతని మేనల్లుడు దేవరాజ్‌లు తనను మోసం చేశారని బాధితుడు పేర్కొన్నాడు. తనకు మలేషియాలో ఉపాధి కల్పిస్తానని దేవరాజ్ తనకు ఫోన్‌లో తెలపడంతో అతని సూచన మేరకు ఆర్మూర్‌లో ఉంటున్న అతడి మేనమామ లక్ష్మణ్‌కు మార్చిలో తాను రూ.95వేల ఇచ్చినట్లు తెలిపారు. అదే నెలలో తనకు నకిలీ వీసా ఇప్పించి మలేషియా పంపించారని, అక్కడ ఉపాధి లేకపోగా తినడానికి తిండి కూడా దొరకలేదని వాపోయడు, అక్కడ ఆరు మాసాల పాటు తాను నరకయాతన పడ్డానని, రూ.లక్ష అప్పు చేసి మూడు మాసాల క్రితం స్వగ్రామానికి చేరుకున్నట్లు బాధితుడు తెలిపాడు. మామ, అల్లుళ్ల కలిసి తనతో పాటు జిల్లాలో మరో 30మందిని ఇదే విధంగా మోసం చేశారని బాధితుడు ఆరోపించాడు. వెంటనే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నవీపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఈ విషయంపై ఎస్‌ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి : షబ్బీర్ అలీ



నగరంలో ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న షబ్బీర్ అలీ

నిజామాబాద్ అర్బన్, జనవరి 5: ప్రజాపాలన కార్యక్రమం ద్వారా పేదలకు లాభం జరుగుతుందని, అందువల్లే ప్రభుత్వం అభయహస్తం దరఖాస్తులను స్వీకరిస్తోందని, ఇది ప్రజల ప్రభుత్వమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించి ప్రజాపాలన దరఖాస్తుల తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. ప్రజల దగ్గరికి వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అర్హత కలిగిన వారంతా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. గత ప్రభుత్వం లాగా తమ పార్టీలోకి వస్తేనే ఇళ్లు, పెన్షన్ ఇస్తామనే అంతా నీచమైన ఆలోచనలు తమకు లేవన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన సంక్షేమ పథకాలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. పేదలకు పంచిన భూములను బీఆర్ఎస్ నేతలు గుంజుకున్నారన్నారు. జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని అవసరమైతే దీన్ని ఇంకా పొడగించడం లేదా నిరంతరంగా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ మకరంద్‌తో కలిసి పలు డివిజన్‌లను ఆయన పర్యటించారు. ప్రజాపాలన తీరుతెన్నులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నగర అధ్యక్షుడు కేశవేణు, నాయకులు భక్త వత్సలం, రత్నాకర్, గడుగు రోహిత్, సుభాష్‌జాదవ్, జావిద్ అక్రమ్, దయాకర్‌గౌడ్, పంచరెడ్డి చరణ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు అకర్షితులై పార్టీలోకి వలసలు : భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, జనవరి 5: రాబోవు రోజుల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇతర రాజకీయ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చాలా ప్రజాప్రతినిధులు సిద్ధంగా ఉన్నారని రూరల్ ఎమ్మెల్యే డా.రేకుల పల్లి భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ ఎంపీటీసీ కుర్రి రామకృష్ణ, యానంపల్లి ఎంపీటీసీ గణేశ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటికే మండలంలోని పలువురు ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో మరో వారంలో డిచ్‌పల్లి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కసారత్తు జరుగుతోంది. ఎంపీపీ,వైస్ ఎంపీపీల పై ఉన్న వ్యతిరేకతే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఎంపీపీ స్థానం కాంగ్రెస్ దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు గతంలో బీఆర్ఎస్‌లో గెలిచి బీజేపీలో కొనసాగుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన డిచ్‌పల్లి సొసైటీ డైరెక్టర్‌లు

ఇది వరకు బీఆర్ఎస్‌లో కొనసాగిన డిచ్‌పల్లి విండో డైరెక్టర్‌లు పదవి కాలం ముగియనుండడంతో శుక్రవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువాలు వేసి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన విండో డైరెక్టర్‌లలో రామచంద్రగౌడ్, నరహరి, దాసరి రాము, లక్ష్మణ్, స్వామి ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ముప్పగంగారెడ్డి, పొలసానిశ్రీనివాస్, కంచెట్టి గంగాధర్, అమృతాపూర్ గంగాధర్, డా.షాదుల్ల, పాల్గొన్నారు. ఈ నెల 23న విండో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన విండో డైరెక్టర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్‌నాయకుల్లో ఆందోళన మొదలైంది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి

ఇందల్వాయి, జనవరి 5: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ముస్తాక్ అనే వ్యక్తి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ధర్పల్లి మాజీ ఎంపీపీ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి రూ.10వేల ఆర్థిక సహాయంతో పాటు క్వింటాలు బియ్యం అందజేశారు. ముస్తాక్ కుటుంబం ఆర్థికంగా చాలా వెనకబడి ఉందని అతనికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నట్లు తెలిపారు. కుటుంబ పెద్ద ముస్తాక్ మృతి చెందడంతో ఆడపిల్లలను పెంచి చదివించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ముస్లిం మత పెద్దలు ఇమ్మడిగోపి దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం బాధిత కుటుంబానికి తనవంతు సహాయం అందజేశారు. తమకు ఆర్థిక సహాయం చేసిన గోపికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు సయ్యాజి, అజీజ్, అబ్దుల్, చాంద్ పాషా, గోపిరెడ్డి, యుగేందర్, శ్రీనివాస్, ఘఫర్, తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, జనవరి 5: జాతీయ స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారిణి మానస ఎంపికైనట్లు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్యామ్ తెలిపారు. సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మానస తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. మహారాష్ట్రలో ఈనెల 6 నుంచి 11 వరకు జాతీయ స్థాయి పోటీల్లో మానస ప్రాతినిధ్యం వహిస్తుందని అన్నారు.

ఇందల్వాయి: ఇందల్వాయి జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి విద్యార్థి బానోత్ విష్ణు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం భాగ్యలక్ష్మి తెలిపారు. అండర్-17 స్థాయి కబడ్డీ పోటీలు జనవరి 7 నుంచి 11వ తేదీ వరకు కామారెడ్డిలో జరుగనున్నాయని ఈ పోటీలలో దేశవ్యాప్తంగా 44 బాలుర జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు.

ఆర్మూర్‌టౌన్: ఈనెల 9నుంచి 13వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు క్రీడాకారిణిలు ఎంపికైనట్లు జిల్లా టెన్నికాయిట్ ప్రతినిధులు మల్లేష్‌గౌడ్, భూపతి తెలిపారు. జిల్లా క్రీడాకారిణిలు త్రిష, ప్రసజ్ఞ, నవనీత, ఉమారాణిలు తెలంగాణ మహిళ సింగిల్ జట్టుకు ఎంపిక కావడం పలువురు వారిని అభినందించారు.

డిచ్‌పల్లి: 67వ స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి పోటీలకు మిట్టపల్లి పాఠశాల క్రీడాకారిని జమున ఎంపికైనట్లు హెచ్ఎం సుశీల్ కుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీత్ రావు తెలిపారు. డిసెంబరు 21 నుంచి 23 వరకు నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ అండర్ -17 పోటీల్లో జడ్పీహెచ్ఎస్ విద్యార్థి గంగాజమున జిల్లా జట్టు తరపున బంగారు పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించి ఈ నెల 10నుంచి 15వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారినిని అభినందించి సన్మానించారు.



భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో భూమిపూజ చేస్తున్న దృశ్యం

మాతృభూమి అభివృద్ధి కోసమే ప్రత్యక్ష రాజకీయాల్లోకి..

- భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో వేదిక నిర్మాణానికి భూమిపూజలో ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

భిక్కనూరు, జనవరి5: చాలా పార్టీలు తనను రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించినా వెళ్లలేదని, తాను పుట్టిన మాతృభూమికి తనవంతు దేదైనా మంచి చేయాలనే తపనతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని ప్రముఖ శాస్త్ర వేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండలం బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో పైడి ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.8 లక్షలతో నిర్మించ తలపెట్టిన వేదిక (ఓ పెన్ డయాస్) నిర్మాణానికి ఆయన టీయూ రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. అన్ని వసతులున్న భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌ను యూనివర్సిటీగా మార్చాలని, అందుకు తాను కృషిచేస్తానని అన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జహిరాబాద్ నుంచి ఎంపీగా పోటీచేసేందుకు ప్రముఖ పార్టీతో చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. అనంతరం రిజిస్ట్రార్ యాదగిరి మాట్లా డారు. అనంతరం ఎల్లారెడ్డిని, రిజిస్ట్రార్ యాదగిరిని క్యాంపస్ సిబ్బంది స న్మానించారు. కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఆర్వో సరిత, స్కాలర్స్ సంతోష్‌గౌడ్, రాహుల్, నా యకులు నాగర్తి చిన్న చంద్రారెడ్డి, క్యాంపస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉన్నతి' లక్ష్యాలను సాధిద్దాం..

నిజాంసాగర్, జనవరి5: ఉన్నతి కార్యక్రమం లక్ష్యాలను సాధిద్దామని కాం ప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంచందర్ అన్నారు. శుక్రవారం నిజాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి అమర్ సింగ్ మాట్లాడుతూ పదో తరగతి విద్యా ర్థులకు సంబంధించిన కార్యక్రమం లక్ష్యాన్ని విజయవంతం చేయాలన్నారు. లైబ్రరీ పీరియడ్‌ను సక్రమంగా వినియోగించుకోవాలని, సైన్స్ ల్యాబ్‌ను, మ్యాథ్స్ ల్యాబ్‌ను వినియోగించుకుని విద్యార్థులను అన్ని నైపుణ్యాలలో ప్రా వీణ్యం సంపాదించడానికి కృషిచేయాలన్నారు.

ఉచితంగా డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణ

బీర్కూర్, జనవరి5: బీర్కూర్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణ ఉచితంగా ఇప్పిస్తున్నామని ఐకేపీ ఏపీఎం గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు డ్వాక్రా గ్రూప్ మండల సమాఖ్య భవనంలో తమపేర్లను నమోదు చేసు కోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఎన్ఆర్ఎల్ఎం హైదరాబాద్‌లో వారం రోజులు డ్రోన్ ఆపరేటర్ ఉచిత శిక్షణ ఇప్పిస్తామని, 18 నుంచి 30 ఏళ్ల లోపు గల మహిళలు తన పేర్లు మండల సమాఖ్యలో నమోదు చేసుకోవాలని తెలిపారు.

గణిత సెమినార్‌కు ఇద్దరు ఉపాధ్యాయుల ఎంపిక

కమ్మర్‌పల్లి, జనవరి 5: రాష్ట్ర సెమినార్‌కు కమ్మర్‌పల్లి మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. మండలంలోని కోనాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌడారపు రాంప్రసాద్, గణిత ఉపాధ్యాయుడు సతీష్ రెడ్డి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల గణిత ఉపాధ్యాయుల సంయుక్త సమావేశంలో ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా గణిత ఫోరం అధ్యక్షుడు కాంతరావు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నోడల్ అధికారి గంగాధర్, హసాకొత్తూర్ హెచ్ఎం డీఎల్ఎన్ చారి, ప్రతినిధులు కృష్ణ కుమార్, దేవానంద్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

డిచ్‌పల్లి, జనవరి 5 :క్రీడల్లో గెలుపోటములు సహజమని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్ కుమార్ అన్నారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీలో నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు శివా, నాగరాజు, సాయికుమార్, అమృత్‌చారి, ప్రమోద్, సింహాద్రి, నర్సింహ, పాల్గొన్నారు.

వర్సిటీ సమస్యలపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక

డిచ్‌పల్లి, జనవరి 5: తెలంగాణ యూనివర్సిటీలోని విద్యారంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించబోతున్నట్లు ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వర్సిటీలో ఉన్న నిధుల సమస్య, బోధన, బోధనేతర సిబ్బంది సమస్య, అవినీతి అక్రమాల విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు మహేశ్, రాజేందర్, సాగర్ నాయక్, పాల్గొన్నారు.

అర్గుల్‌లో బంగారు గొలుసు చోరీ

జక్రాన్‌పల్లి, జనవరి5: మండలంలోని అర్గుల్ గ్రామంలో వెంకటేశ్వరకాలనీ సమీపంలో 44వ జాతీయరహదారిపై ఓ మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని దుండగులు రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం వెంకటేశ్వరకాలనీకి చెందిన సువర్ణ అర్గుల్‌లోని బీడీ కర్ఖానకు వెళ్లేందుకు రహదారిపై ఆటో కోసం వేచి చూస్తోంది. ఇంతలో బైక్‌పై ఇద్దరు దుండగులు వెనుక నుంచి సువర్ణ మెడలోంచి బంగారు గొలుసులను లాక్కొని పారిపోయారు. అలాగే నల్లగుట్ట తండా గ్రామం నుంచి జక్రాన్‌పల్లికి ఇద్దరు మహిళలు వెళ్తుండగా గుర్తుతెలియని దుండగులు బైక్‌పై వెనుక నుంచి వచ్చి బంగారు గొలుసులను తెంపేందుకు యత్నిస్తుండగా అరుపులు, కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మల్లారం అటవీప్రాంతంలో యువకుడి మృతదేహం

నిజామాబాద్ రూరల్, జనవరి 5: రూరల్ మండలం మల్లారం అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ మండలం మల్లారం గండిలోని అటవీ ప్రాంతంలోని పెద్ద బండరాయి చాటున ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి వయస్సు 35-40 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. ఘటనాస్థలిలో మద్యం సీసాలు ఉన్నాయి. అటవీప్రాంతంలో దావత్ చేసుకున్న తర్వాత జరిగిన ఘర్షణలో ఈ హత్య జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్, సీఐ వెంకటనారాయణ క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ తెప్పించి చుట్టపక్కల గాలించారు. అయినా ఆనవాళ్లు లభించలేదు. మృతుడి చేతిపై గాయత్రి అనే పచ్చబొట్టు మినహా ఇతర వివరాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు 8712659849, 8712659847 నెంబర్‌లకు సమాచారం అందించాలని రూరల్ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

రెంజల్,జనవరి5: మండలంలోని వీరన్నగుట్ట తండాకు చెందిన రత్నవత్ కృష్ణ(39) జీవితంపై విరక్తి చెందిన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరన్నగుట్ట తండాకు చెందిన రత్నవత్ కృష్ణకు నవీపేట మండలం ఫకీరాబాద్ గ్రామానికి చెందిన నందును 15ఏళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు అరవింద్(14), ఆది(12) ఉన్నారు. కొంత కాలంగా కృష్ణ హైదరాబాద్ నగరంలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. డిసెంబర్ 31వ తేదీన ఇంటికి వచ్చిన కృష్ణ భార్య నందతో గొడవ పడ్డాడు. గురువారం ఉదయం మళ్లీ గొడవ జరగడంతో తన చిన్న కుమారుడిని తీసుకుని నంద పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన కృష్ణ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తలుపులు మూసి ఉండడంతో గమనించిన సోదరుడు వెళ్లి చూసే సరికి కృష్ణ వేలాడుతున్నట్లు చెప్పడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ తలకిందులై డ్రైవర్ మృతి

నిజాంసాగర్(మహ్మద్‌నగర్), జనవరి5: మహ్మద్‌నగర్ మండలం గున్కు ల్ గ్రామశివారులో శుక్రవారం ట్రాక్టర్ తలకిందులై డ్రైవర్ మృతిచెందాడు. నిజాంసాగర్ పోలీసుల వివరాల ప్రకారం.. గున్కుల్ గ్రామానికి చెందిన రాయకుని అనిల్ (22) తన మేనమామ సాయిరాం ట్రాక్టర్ నడుపుతున్నాడు. శుక్రవారం అనిల్ పొలం దున్ని నర్వ రాములు పొలంలో నుంచి బయటికి వస్తున్నాడు. పక్క పొలంలోని శ్రీనివాస్‌గౌడ్‌కు చెందిన ట్రాక్టర్ గట్టుపైకి ఎక్కకపోవడంతో ట్రాక్టర్‌ను పైకి ఎక్కిస్తానని చెప్పి అనీల్ ట్రాక్టర్ ఎక్కగా ట్రాక్టర్ ఒక్కసారిగా తలకిందులవడంతో డ్రైవర్ సీట్‌లో ఉన్న అనిల్ ట్రాక్టర్ కింద పడి అనిల్ మృతిచెందాడు. మృతుడి తల్లి సాయవ్వ ఫిర్యాదుమేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు బాన్సువాడకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

వర్ని,జనవరి5: చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన దాసరి రమేష్(40)అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 4వ తేదీన రమేష్ ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. అతడి సోదరుడు దాసరి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఖిల్లా, జనవరి 5: నగరంలోని ఒకటో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కోజాకాలనికి చెందిన సయ్యద్ సాజిద్ అనే వ్యక్తి ఇంట్లో ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు తెలిపారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం సయ్యద్ సాజిద్ ఇంట్లో తనిఖీ చేసి అతడి వద్ద నుంచి రూ.7600 నగదు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదుకు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మోర్తాడ్, జనవరి5 : మండలంలోని పాలెం శివారులో శుక్రవారం సాయంత్రం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పిట్ల మల్లేష్(35) అనే యువకుడు మృతి చెందాడని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం పాలెం నుంచి మోర్తాడ్ వైపు వస్తుడగా సబ్‌స్టేషన్ వద్ద కల్వర్టుకు ఢీకొని బురదలో చొచ్చుకు పోవడంతో ఊపిరాడక మృతి చెందడని ఎస్సై తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొరం టిప్పర్ పట్టివేత

నవీపేట,జనవరి5: మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్ నుంచి రెంజల్ మండలం తాడ్‌బిలోలికి అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. గ్రామ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారనే విషయాన్ని స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో మొరం టిప్పర్, మరో ఖాళీ టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- వారం రోజుల్లో ప్రజాపాలన దరఖాస్తులు కంప్యూటరీకరణ
- ఆర్డీవో రాజేందర్ కుమార్

డిచ్‌పల్లి, జనవరి 5: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులను గ్రామాల్లోనుంచి స్వీకరించిన వాటిని వారంలోపు ఆన్‌లైన్ కంప్యూటరీకరణ పూర్తి చేసి నివేదికలు అందజేయాలని ఆర్డీవో రాజేందర్ కుమార్ అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి తహసీల్ కార్యాలయం వెనుక మానవతాసదన్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల కంప్యూటర్ ఆపరేటర్‌లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దరఖాస్తు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం చేయకుండా ప్రతిధరఖాస్తును ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేందర్, ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు, 7మండలాల కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మండలంలోని ఘన్‌పూర్‌లో ప్రజాపాలన గ్రామ సదస్సును ఎంపీడీవో టీవీఎస్‌బాబు, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తు వివరాలను పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రక్రియలో దరఖాస్తులను ఎక్కడ కూడా వృథాగా ఉంచకుండా బీరువాలలో దాచాలని సూచించారు. కార్యదర్శులు అందరు ప్రజలకు జవాబుదారీగా పనిచేసినప్పుడు ప్రజలకు అధికారులపై విశ్వాసం ఏర్పాడుతుందని అన్నారు.

నవీపేట: ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయంతో పాటు పాలిటెక్నిక్ కళాశాలలో ఈ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. శుక్రవారం సాయంత్రం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ పరిశీలించారు. కార్యక్రమంతో తహసీల్దార్ ధన్‌వాల్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ, తదితరులున్నారు.



డిచ్‌పల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో



మాదాపూర్‌లో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ధర్పల్లి: మండలంలో ఇప్పటి వరకు వచ్చిన అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసినట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 12,390 దరఖాస్తులు వచ్చాయని వీటన్నింటిని ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. ఏ ఒక్క దరఖాస్తు పక్కకు పోకుండా వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నట్లు ఆయన అన్నారు. మండలంలోని 22 మంది కార్యదర్శుల సహకారంతో పాటు మండల సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నట్లు చెప్పారు. శనివారంతో ప్రజాపాలన ముగియనున్నట్లు చెప్పారు. దరఖాస్తులన్నింటిని ఆన్‌లైన్ చేసి సిద్ధంగా ఉంచనున్నట్లు చెప్పారు.

మాక్లూర్ : ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అధికారులు అసలైన లబ్ధిదారులను సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ముత్తెన్న, ఎంపీడీవో క్రాంతి, మండల వ్యవసాయాధికారి పద్మ, సర్పంచ్ లక్ష్మీ లింగారావు, సర్పంచ్ ఉపసర్పంచ్ శేషు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని నిజాంపూర్, లింగాపూర్, అబ్బాపూర్(బి), నందిగామలలో శుక్రవారం ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజల నుంచి అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధన్‌వాల్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.



సిరికొండలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

కోటగిరి: పోతంగల్ మండలం సోంపూర్, టాక్లీ, దోమలెడ్గి గ్రామాల్లో శుక్రవారం ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో వివిధ పథకాల కింద దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీవో మారుతి, సర్పంచ్‌లు భాగ్యలక్ష్మి, జయరాణి, ఎంపీటీసీ విఠల్, పంచాయతీ కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.

సిరికొండ : సమాజంలోని అన్ని వర్గాలు, మతాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని తాటిపల్లి, చీమన్‌పల్లి, పందిమడుగు, సిరికొండ గ్రామాల్లో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం దళిత, బడుగు,బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజా పాలన ప్రత్యేక అధికారి నాగరావు, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, తహసీల్దార్ రవీందర్‌రావు,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రవి,సిరికొండ సర్పంచ్ రాజరెడ్డి, సాయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

రెంజల్: ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిర్వహించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో రాజాగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 లాగిన్లు ఉంటే అందులో ఏడు లాగిన్లను ప్రారంభించడం జరిగిందని, త్వరితగతిన మిగతా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, తదితరులున్నారు.

నేడు కొత్తపల్లికి మంత్రి జూపల్లి కృష్ణారావు రాక

కోటగిరి,జనవరి5: కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ప్రజా పాలన ముగింపు కార్యక్రమానికి శనివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నారని కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంతో పాటు ఇతర ప్రగతి పనులను మంత్రి పరిశీలించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ

నిజామాబాద్ అర్బన్, జనవరి 5: గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ తరగతులు ఫిబ్రవరి 1 నుంచి టీఎస్‌బీసీ స్టడీ సర్కిల్ నిజామాబాద్‌లో ప్రారంభమవుతాయని స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈనెల 8 నుంచి 20వ తేదీ వరకు టీఎస్‌బీసీ స్టడీ సర్కిల్.సీజీజీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ అందిస్తామని ఇతర వివరాలకు 08462-241055 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

8న నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

సుభాష్‌నగర్, జనవరి 5: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువకేంద్ర అధికారి శైలిబెల్లాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోగల నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల వయస్సు మధ్యగల యువతీ యువకులు ఈ పోటీలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉపన్యాస అంశం 'నా భారతం వికసిత భారతం' అనే అంశం మీద మాత్రమే ఉపన్యాస పోటీ ఉంటుందని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతికి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి ఇద్దరికి రూ.20వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల ఉపన్యాసకులు ఈనెల 7వ తేదీ సాయంత్రం 5గంటలలోపు నెహ్రూ యువకేంద్రం కార్యాలయం 9100435410 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పేర్లు, వివరాలు పంపించి నమోదు చేసుకోవాలన్నారు.

డిచ్‌పల్లిలో ఆపరేషన్ స్మైల్

డిచ్‌పల్లి,జనవరి 5: బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనకు మండల కేంద్రంలో శుక్రవారం ఆపరేషన్ స్మైల్ నిర్వహించారు. మండల కేంద్రంలో పలు చికెన్ సెంటర్‌లలో పనిచేస్తున్న యాంటీ ఉమెన్ ట్రాఫిక్ ఇన్ యూనిట్ ప్రతినిధులు చిన్నారుల తల్లిదండ్రులకు కావాల్సిన కౌన్సెలింగ్ చేసి చిన్నారులను పనులకు పంపించవద్దని, చదువు కోసం స్కూల్ కు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఆపరేషన్ స్మైల్ అధికారులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు



నాడాపూర్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవీపేట, జనవరి 5: మండలంలోని జన్నేపల్లి, నాడాపూర్‌లలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాలలో జరిగిన గ్రామసభలలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అధికారులు ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, సర్పంచ్‌లు సబిత,లత, ఎంపీటీసీ రాణి పాల్గొన్నారు.

ఫ్లోర్‌మిల్ ద్వారా ఆర్థిక స్వావలంబన

డిచ్‌పల్లి, జనవరి 5: డీఆర్‌డీఏ ద్వారా మంజూరైన రూ.3 లక్షల విలువ చేసే ఫ్లోర్ మిల్ నడుపుకుంటూ ఆర్థిక సముపార్జన సాగించాలని నిరుపేదల అభ్యున్నతే డీఆర్‌డీఏ లక్ష్యమని పీడీ చందర్ నాయక్ అన్నారు. శుక్రవారం గ్రామంలో సమీనా జమీల్ కుటుంబ సభ్యులకు రూ.3లక్షల విలువల చేసే ఫ్లోర్ మిల్ మంజూరు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్న ఊరిలోనే ఆర్థిక సముపార్జన పొందేందుకు ఫ్లోర్‌మిల్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. మహిళలు స్వయం సమృద్ధితో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తే రుణాలు ఇప్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి, ఎంపీటీసీ సుజాత రవి, విండో ఛైర్మన్ తారచంద్ నాయక్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సునీల్, ఏపీఎం రజిత, వివో మీనా, సీసీ స్వప్న గ్రామస్థులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మాక్లూర్, జనవరి5: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్షలకు రెండు నెలల మాత్రమే సమయం ఉందని, ప్రణాళిక బద్ధంగా చదువుకొని, అర్థం కాని అంశాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి ప్రగతి, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విపత్తు, అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నందిపేట, జనవరి5: మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, నందిపేట అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో విపత్తు, అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తుఫాను, సముద్రంలో పడవల మునక నుంచి కాపాడే సూచనలు విద్యార్థులకు వివరించారు. అలాగే అగ్ని ప్రమాదాల నివారణ, గ్యాస్ లీకేజీ, మంటలు ఆర్పడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అరుణ్, ప్రిన్సిపాల్ రవి కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు వికాశ్ రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నందిపేట అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

వర్ని,జనవరి5: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఏరియా కమిటీ సమావేశం బొర్ర గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా నిజాంసాగర్ కెనాల్ పక్కన రోడ్డుకు ఇరువైపులా ఇనుప రోలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు అరికట్టాలని ఆర్ అండ్ బీ అధికారులను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయగౌడ్, గణపతి, లక్ష్మణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతల వితరణ

ఎడపల్లి, జనవరి 5: మండల కేంద్రంలో శుక్రవారం అయోధ్య రాముని అక్షింతలను గ్రామ యువకులు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సాయంత్రం 6 గంటలకు ప్రతీ ఇంటి ఎదుట ఐదు దీపాలు వెలిగించాలని సూచించారు. అక్షింతలతో పాటు అయోధ్య రామ మందిర చిత్రపటంతో పాటు శ్రీరాముని కరపత్రాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లెపూల శ్రీనివాస్, కంజర్ చంద్రకాంత్, శిరిశెట్టి సంతోష్, కంజర్ అవిజ్ఞ రాజ్, శిరిశెట్టి మమత, కంజర్ అనూష, భూపతి, ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

డిచ్‌పల్లి: అయోధ్య రాముని అక్షింతలను శుక్రవారం ఘన్‌పూర్‌లో ఇంటింటికీ పంపిణీ చేశారు. సందర్భంగా మహిళలు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సోమ్‌నాథ్, శ్రీనివాస్, రాజు, లింబాద్రి, గణేశ్, రమణ, ఓంప్రసాద్, చిరంజీవి, గోపిచంద్, రామకృష్ణ, రమణ, సాగర్, బాలు, కపిల్, రాజు, శేఖర్, లోకేశ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : మున్సిపల్ పరిధిలోని 33వార్డులో అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి అయోధ్య రాముని అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పుప్పాల రాజేందర్, కలిగోట గంగాధర్, బోడమీది నవీన్, పాల అవినాష్, లోలం భార్గవ్, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లిలో అక్షింతలను పంపిణీ చేస్తున్న గ్రామ యువకులు

నందిపేట : మండల కేంద్రంలోని పాతూర్ శివాజీ గల్లీలో శుక్రవారం అయోధ్య రాముడి అక్షింతలు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అక్షింతలతో పాటు నూతనంగా ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్మించిన రామ మందిరం ఫొటోలను వితరణ చేశారు. గ్రామస్థులు భక్తి, శ్రద్ధలతో అక్షింతలు రామ మందిరం ఫొటోలను పూజించారు. వాటిని తీసుకువెళ్లి పూజ గదిలో భద్రపరిచారు. అక్షింతల ఊరేగింపునకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగ సురేష్, తారక, నర్సాగౌడ్, వాల్గోట్ రాజు, సామల ముత్యం, బర్కి సుధాకర్, నాగ శ్రీనివాస్, నరేష్, ముత్యం ఉన్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తా : రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జనవరి5: ఆర్మూర్ నియోజకవర్గంతో పాటు పట్టణంలో ప్రభుత్వ స్థలాలు, భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్‌కు చెందిన పది శాతం, ఐదు శాతం స్థలాలు కబ్జాకు గురి కాకుండా చూస్తామన్నారు. ఆర్మూర్ పట్టణ కేంద్రంతో పాటు పెర్కిట్ శివారులో నీటి పారుదల శాఖకు చెందిన స్థలాన్ని అధికారులు గతంలో సర్వే చేసి గుర్తించాలని, ఈ విషయమై సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. ప్రభుత్వ స్థలాలను ఎవరు కబ్జా చేసిన సహించేది లేదన్నారు. ఆర్మూర్ బస్‌డిపో ఎదుట మురుగునీరు ప్రవహిస్తుందని, టెండర్‌లు నిర్వహించి కాల్వ నిర్మాణానికి కృషి చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. అంతకు ముందు నందిపేట మండలానికి చెందిన పలువురికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ ఫ్లోర్‌లీడర్ జీవీ.నర్సింహరెడ్డి, ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, నాయకులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి